క్లుప్తంగా

అలరించిన కార్తిక దీపాలంకరణ



దీపాలంకరణ గావిస్తున్న మహిళలు

అమలాపురం టౌన్: స్థానిక దుడ్డివారి అగ్రహారంలోని బాల విద్యార్థి గణపతి ఆలయం వద్ద కార్తిక సోమవారం సందర్భంగా మహిళల ఆధ్వర్యంలో కొలువు దీరిన దీపాలంకరణ దేదీప్యమాన వెలుగులతో అలరించింది. బాల విద్యార్థి గణపతి ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమాన్ని భక్తులు తిలకించి తరించారు.

వీరేశ్వరునికి దీపంకుందుల సమర్పణ

ఐ.పోలవరం: మురమళ్ల శ్రీ వీరేశ్వరస్వామి ఆలయానికి ఓ భక్తుడు సోమవారం ఇత్తడి దీపం కుందులు బహూకరించారు. అమలాపురానికి చెందిన కేతవరపు భార్గవ దంపతులు సుమారు రూ.18వేలు విలువ చేసే ఈ కుందులను ఆలయ పర్యవేక్షణాధికారి కఠారి శ్రీనివాసరాజుకు అందజేశారు. దాతను ఆలయ సహాయ కమిషనర్, కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మీనారాయణ అభినందించారు.

నేటి నుంచి ఆధార్ క్యాంపులు

తాళ్లరేవు: మండల పరిధిలోని గ్రామాల్లో మంగళవారం నుంచి ఆధార్ ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కె.సత్యనారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 0–6 సంవత్సరాల పిల్లలకు ఆధార్ నమోదు, 5 నుంచి 15 ఏళ్లు దాటిన పిల్లలకు బయోమెట్రిక్ అప్డేషన్, ఇంటి చిరునామా మార్పు తదితర సేవలు ప్రజలకు అందుబాటులో ఉంచినట్లు చెప్పారు.

తాత్కాలిక భవనంలో కోర్టు విచారణలు

యానాం: యానాం సబ్‌కోర్టు శిథిలావస్థకు చేరుకోవడంతో తాత్కాలికంగా మున్సిపల్ కల్యాణమండపం లో ఏర్పాటు చేసిన భవనంలో సోమవారం నుంచి కోర్టు విచారణ కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. స్థానిక కామిశెట్టివారి వీధిలో ఏర్పాటు చేసిన సబ్‌కోర్టుకు కావాల్సిన సదుపాయాలు, ఫర్నీచర్, విద్యుత్ తదితర సదుపాయాలను ఏర్పాటు చేశారు. తాత్కాలిక భవనంలో కోర్టు సిబ్బంది తమ విధులను యథావిధిగా నిర్వహించారు.

సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు విఫలం

తాళ్లరేవు: నిత్యావసర వస్తువుల ధరల నియంత్రణ, యువతకు ఉపాధి కల్పించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలమయ్యాయని సీపీఎం మండల కన్వీనర్ టి.ఈశ్వరరావు అన్నారు. సోమవారం ప్రజాపోరు కార్యక్రమంలో భాగంగా మండలంలోని గ్రామాలలో పార్టీ ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం డీఎస్సీ ప్రకటిస్తుందని ఎంతో ఆశగా ఎదురు చూస్తున్న యువత నిరాశ చెందారన్నారు. మహిళలు, బాలికలు, దళితులపై దాడులు, అత్యాచారాలు ఆగడం లేదన్నారు. సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని ఆర్‌ఐ రామకృష్ణకు అందజేశారు.

స్విమ్మింగ్‌పూల్ పనుల పరిశీలన

యానాం: పట్టణ పరిధిలోని బాలయోగి స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఆవరణలో ఉన్న స్విమ్మింగ్‌పూల్ ఆధునీకరణ పనులను సోమవారం పుదుచ్చేరి ప్రభుత్వ ఢిల్లీ ప్రతినిధి మల్లాడి కృష్ణారావు పరిశీలించారు. అనంతరం కనకాలపేటలోని మినీ ఇండోర్ స్టేడియం పనులను సైతం స్థానిక నాయకులతో కలిసి ఆయన పరిశీలించారు.

అక్రమ వసూళ్లకు పాల్పడితే చర్యలు

ముమ్మిడివరం: ముమ్మిడివరం పట్టణ పరిధిలో ఇంటి నిర్మాణాలు, వ్యాపార షెడ్ల నిర్మాణ విషయంలో నగర పంచాయతీ సిబ్బంది అక్రమ వసూళ్లకు పాల్పడితే విచారణ నిర్వహించి చర్యలు తీసుకుంటామని నగర పాలక కమిషనర్ పి.రవివర్మ స్పష్టం చేశారు. ఇంటి నిర్మాణాలు, వ్యాపార షెడ్లను నిర్మించుకోవాలంటే ముందుగా నగర పంచాయతీ కార్యాలయం నుంచి అనుమతి పొంది మొదలు పెట్టాలన్నారు. అనుమతి లేని నిర్మాణాలను వెంటనే నిలుపుదల చేసి మున్సిపాలిటీ చట్టం ప్రకారం నిర్మాణాలను తొలగించడం జరుగుతుందన్నారు.

జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ వద్దు

అమలాపురం రూరల్: జిల్లాల వారీగా ఎస్సీ వర్గీకరణ చేస్తే ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో మాదిగలు, రెల్లి ఉపకులాలు తీవ్రంగా నష్టపోతారని రాష్ట్రాన్ని యూనిట్‌గా తీసుకుని వర్గీకరణ చేయాలని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర కన్వీనర్ మోకాటి నాగేశ్వరరావు సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ఈమేరకు సోమవారం నడిపూడి బాబూ జగజ్జీవన్‌రామ్ భవన్‌లో అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఎంఆర్‌పీఎస్ ముఖ్య నాయకుల సమావేశంలో మాట్లాడారు. 75 ఏళ్లుగా ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా మాదిగలు విద్య, ఉద్యోగ రాజకీయ, ఆర్థిక రంగాల్లో తీవ్రంగా నష్టపోయారన్నారు. సమావేశంలో సీనియర్ ఎమ్మార్పీఎస్ నాయకులు కాప నాగభూషణం తొత్తరమూడి ప్రభాకరరావు, చాట్ల సత్యనారాయణ, మంద వెంకటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సందు సందుకు మందు..!

- పుట్టగొడుగుల్లా మద్యం బెల్టు షాపులు
- బార్లను తలపిస్తున్న పర్మిట్ రూం అమ్మకాలు
- రహదారులపై పడిపోతున్న మందుబాబులు
- బాటసారులు, వాహన చోదకులకు ఇబ్బందులు



ప్రభుత్వ మద్యం దుకాణం పక్కనే నిర్వహిస్తున్న అనధికారిక పర్మిట్ దుకాణం

కాట్రేనికోన: కూటమి ప్రభుత్వం పుణ్యమా అని గ్రామాల్లో మద్యం ఏరులై పారుతోంది. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో నూతన మద్యం పాలసీ విధానం తీసుకురావటం ద్వారా మద్యం విచ్చలవిడి అమ్మకాలు చేపట్టకుండా నియంత్రణ చర్యలు చేపట్టడంలో నాటి ప్రభుత్వం విజయవంతమైంది. కానీ నేడు పరిస్థితి పూర్తిగా అదుపు తప్పింది. ప్రభుత్వ టెండర్లలో మద్యంషాపులు దక్కించుకున్న వ్యాపారులు సిండికేట్ రింగులోకి రావడంతో గ్రామాల్లో పుట్టగొడుగుల్లా బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. దీంతో అధిక ధరలకు మద్యం విక్రయాలు జోరుగా చేస్తున్నారు. మండలంలో ఆరు మద్యం షాపులను లాటరీ పద్ధతిపై దక్కించుకున్న వ్యాపారులు ఒక్కొక్క షాపుకు రూ.65 లక్షలు చెల్లించి లైసెన్సులు పొందారు. ముమ్మిడివరం నియోజకవర్గంలో ఐ.పోలవరం, ముమ్మిడివరం, కాట్రేనికోనలో 13 లైసెన్సు షాపులు ఉన్నాయి. కాట్రేనికోనలో మూడు, చెయ్యేరు ,కందికుప్ప, పల్లంకుర్రులలో ఒక్కొక్కటి చొప్పున లైసెన్సు షాపులు ఉన్నాయి.

అనధికారిక పర్మిట్ రూమ్‌లు

ప్రభుత్వం నుంచి పర్మిట్ రూమ్‌కు అనుమతులు లేకున్నా అనధికారికంగా ప్రతి షాపు పక్కనే ఒక పర్మిట్ రూంను తెరచి మందుబాబులకు సకల సౌకర్యాలతో మందు పోస్తుండటంతో వీరంతా బారులు తీరుతున్నారు. మందుబాబులకు అవసరమైన వాటిని అందుబాటులో ఉంచుతున్నారు. వీటిపై కూడా అదనపు రేట్లు వసూలు చేస్తున్నారు. దీంతో అక్కడే తాగి, తూగుతూ మత్తులోకి జారుకుంటున్నారు.



తాగి అక్కడే మత్తులోకి జారుకున్న మందుబాబు

కుటీర పరిశ్రమగా మారిన వైనం

ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన మద్యం వ్యాపారులు సిండికేట్ రింగులోకి బెల్టు షాపులను తీసుకురావటంతో వ్యాపారం మూడు పువ్వులు, ఆరుకాయలుగా మారింది. మండల పరిధిలో సుమారుగా 350కి పైబడి బెల్టు షాపులలో మద్యం అమ్మకాలు సాగిస్తున్నారు. మందుబాబులు మద్యాన్ని బహిరంగ ప్రదేశాలలో సేవించి ప్రజలను ఇబ్బంది పెట్టకూడదనే నిబంధనను గాలికి వదిలేయడంతో స్థానికులు ఇబ్బందులు పడుతున్నారు. బెల్టు షాపుల రద్దుపై మహిళలకు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ తుంగలో తొక్కేశారు. సంబంధిత అధికారుల కనుసన్నలలో మద్యం వ్యాపారం సాగడంతో మొక్కు బడిగా దాడులు చేసి వదిలేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

అమ్మకాలకు వేలం పాటలు

మత్స్యకార గ్రామాల్లో మద్యాన్ని బెల్టుషాపుల ద్వారా అమ్మకాలు చేపట్టేందుకు వేలంపాటలు నిర్వహించారు. చిర్రయానంలో రూ.9.75లక్షలు, గొల్లగరువులో రూ.1.25 లక్షలు, దొంతికుర్రులో రూ.2.30లక్షలకు ఏడాదికి గాను పాట నిర్వహించారు. పల్లం, బలుసుతిప్ప, కొత్తపాలెం, మొల్లేటిమొగ, పోర, రాజానగరం, నీళ్లరేవులు అంతర్గత ఒప్పందాలతో బెల్టు షాపులు నిర్వహిస్తున్నారు.

ఎంఆర్‌పీ కంటే అధిక ధరలకు అమ్మకాలు

ప్రభుత్వం నుంచి లైసెన్సు పొందిన మద్యంషాపులలో ఎంఆర్‌పీ ధరల కంటే రూ.10లు నుంచి రూ.30ల వరకు అదనపు ధరలకు అమ్మకాలు చేపడుతున్నారు. వీటని బెల్టుషాపులకు అమ్మేసరికి మరింత అదనపు ధరలు వసూలు చేస్తున్నారు. బెల్టు షాపుల నిర్వాహకులు వ్యాపారులు నుంచి కొనుగోలు చేసిన ధరకు రూ.20 నుంచి రూ.50ల వరకు అదనపు ధరలపై అమ్మకాలు చేస్తున్నారు. మద్యం వ్యాపారుల తీరుపై జేబుకు చిల్లు పడుతుందని మందుబాబులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

చట్టపరమైన చర్యలు

అనధికారిక మద్యం పర్మిట్ షాపులు, బెల్టుషాపులు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. ఆకస్మిక తనిఖీలు చేసి బాధ్యులపై కేసులు నమోదు చేస్తాం.

– అవినాష్, ఎస్సై , కాట్రేనికోన

విశ్వేశ్వరస్వామి ఆలయంలో లక్ష దీపోత్సవం



లక్ష దీపోత్సవంలో కార్తిక దీపాలు వెలిగిస్తున్న భక్తులు

తాళ్లరేవు: పిల్లంక, బ్రహ్మపురి నడుమ వేంచేసియున్న అన్నపూర్ణా సమేత విశ్వేశ్వర స్వామివారు, శ్రీదేవి, భూదేవి సమేత కేశవస్వామి వార్ల ఆలయ ప్రాంగణంలో లక్ష దీపోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. పవిత్ర కార్తికమాసం మూడవ సోమవారాన్ని పురస్కరించుకుని మూడు గ్రామాలు, పరిసర ప్రాంత భక్తుల సహకారంతో దీపోత్సవం కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించినట్లు వేద పండితులు వేలూరి వెంకట కామేశ్వర శర్మ తెలిపారు. లక్ష దీపోత్సవం సందర్భంగా ఆలయ ప్రాంగణం దీపకాంతులతో కళకళలాడింది. విశ్వేశ్వరస్వామి ఆలయానికి బ్రహ్మపురి గ్రామానికి చెందిన సాగి హరిబాబు, శైలజ దంపతులు, వారి కుమార్తె అనూష దంపతులు దీపారాధన సామాగ్రి నక్షత్ర హారతుల సెట్‌ను బహూకరించారు.

అక్రమ ఇంధన వ్యాపారాన్ని అరికట్టాలి



కేంద్ర మంత్రి శ్రీనివాసరాజుతో బంకుల నిర్వాహకులు

అమలాపురం టౌన్: పాండిచ్చేరి, యానాం ద్వారా జిల్లాలోకి వస్తున్న అక్రమ ఇంధన వ్యాపారాన్ని అరికట్టాలని కోరుతూ జిల్లా పెట్రోలు, డీజిల్ బంకుల యాజమానులు కేంద్ర మంత్రి భూపతిరాజు శ్రీనివాసరాజుకు వినతి పత్రం అందించారు. అమలాపురానికి వచ్చిన మంత్రి శ్రీనివాసరాజును బంకుల యాజమానుల బృందం కలిసి ఈ సమస్యపై చర్చించింది. యానాం నుంచి అక్రమంగా దిగుమతి అవుతున్న పెట్రోలు, డీజిల్ వల్ల తమ వ్యాపారాలపై తీవ్ర ప్రభావం పడి నష్టపోతున్నామని యజమానులు జవ్వాది తాతబాబు, దాసరి రత్నాకర్ తదితరులు మంత్రి వద్ద ఆవేదన వ్యక్తం చేశారు. పాండిచ్చేరి, యానాం జిల్లాల మధ్య ఇంధన ధరల అసమానతలను తొలగించాలని విజ్ఞప్తి చేశారు.

గ్రంథాలయాలతో మేధోసంపద వృద్ధి

కాట్రేనికోన: గ్రంథాలయాలు విజ్ఞానం, వినోదంతో పాటు మనిషి మేధస్సును పెంచే విద్యా నిలయాలని గ్రంథాలయాధికారి శ్రీహరిరావు అన్నారు. మండలంలోని కందికుప్ప, కాట్రేనికోనలో 57వ గ్రంథాలయ వారోత్సవాలు జరుపుకున్నారు. విద్యార్థులకు చిత్ర లేఖనం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. పోటీల్లో విజేతలకు బహుమతులు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థినీ, విద్యార్థులు పాల్గొన్నారు.

వసతి గృహాలు, గురుకులాల నిర్వహణపై నివేదిక ఇవ్వండి

అధికారులకు కలెక్టర్ మహేష్‌కుమార్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మహేష్‌కుమార్

అమలాపురం రూరల్: ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, చైల్డ్‌కేర్ సెంటర్లలో మౌలిక సదుపాయాల మరమ్మతులు, మెనూ అమలులో లోపాలను చెక్‌లిస్ట్ ప్రకారం గుర్తించి వారం రోజుల్లో నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆర్.మహేష్ కుమార్ సంబంధిత శాఖల అధికారులను ఆదేశించారు. ఈ మేరకు జిల్లాలోని 84 ఎస్సీ, బీసీ సంక్షేమ వసతి గృహాలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, చైల్డ్‌కేర్ సెంటర్లలో మౌలిక సదుపాయాలు, పారిశుద్ధ్యం తదితర సమస్యలను గుర్తించడానికి ఒక్కొక్క వసతి గృహానికి ఓ ప్రత్యేక అధికారితో పాటు ఇంజినీర్ ను నియమించామన్నారు. సోమవారం ఆయన కలెక్టరేట్ గోదావరి భవన్‌లో వివిధ విభాగాల ఇంజినీర్లు, ప్రత్యేక అధికారులు, ఎస్సీ, బీసీ సంక్షేమ విద్యాశాఖ అధికారులతో సమావేశం నిర్వహించి ఈ మేరకు ఆదేశాలు జారీ చేశారు. జిల్లా జాయింట్ కలెక్టర్ టీ.నిషాంతి మాట్లా డుతూ సంక్షేమ వసతి గృహాలు, ప్రభుత్వ రెసిడెన్షియల్ పాఠశాలలు, కళాశాలల పనితీరు మెరుగుపడేలా సంక్షేమ శాఖల అధికారులు అంకితభావంతో కృషి చేయాలని హితవు పలికారు. ఈ కార్యక్రమంలో డీఆర్‌ఓ మదన్‌మోహన్‌రావు, జిల్లాస్థాయి అధికారులు, ప్రత్యేక అధికారులు, ఇంజినీర్లు పాల్గొన్నారు.

కంప్యూటరీకరణతో సహకార ప్రగతి



ఉద్యోగుల చేత సహకార ప్రతిజ్ఞ చేయిస్తున్న జిల్లా సహకార అధికారి మురళీకృష్ణ

అమలాపురం టౌన్: బ్యాంకింగ్ రంగంతో పోటీ పడుతూ కంప్యూటరీకరణ తదితర ఆధునిక పోకడలతో సహకార వ్యవస్థ ప్రగతి పుంతలు తొక్కుతోందని జిల్లా సహకార అధికారి (డీసీవో) ఎస్.మురళీకృష్ణ అన్నారు. స్థానిక కళా వెంకట్రావు ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘంలో సోమవారం జరిగిన 71వ సహకార వారోత్సల సభలో మురళీకృష్ణ మాట్లాడారు. అమలాపురం డివిజనల్ సహకార అధికారి ఎ.రాధాకృష్ణారావు వారోత్సవాల్లో అయిదో రోజు నిర్దేశిత అంశమైన 'సహకార సంఘాల మధ్య సహకారం'పై మాట్లాడి సంఘ సిబ్బందికి అవగాహన కల్పించారు. సంఘం పర్సన్ ఇన్‌చార్జి ఎ.లహరి మాట్లాడుతూ సంఘం సభ్యులకు అందిస్తున్న సహకార సేవలు, విధులను వివరించారు. సంఘ సిబ్బంది చేత డీసీవో మురళీకృష్ణ సహకార ప్రతిజ్ఞ చేయించారు. సీఈవో టి.దొరాజీ, సంఘం పాలక మండలి మాజీ సభ్యుడు నాగాబత్తుల రాజారావు తదితరులు పాల్గొన్నారు.

అలసత్వం వహిస్తే చర్యలు తప్పవు

అల్లవరం: బ్యాంక్ ఖాతాలు లేని వారికి పోస్టాఫీసు ఖాతాలు ఓపెన్ చేయించాలని, తెరిచిన ఖాతాలకు నేషనల్ పేమెంట్స్ ఆఫ్ కార్పొరేషన్‌కు అనుసంధానం చేయాలని ఎంపీడీఓ కృష్ణమోహన్ ఆదేశించారు. మండల పరిషత్ కార్యాలయంలో కార్యదర్శులు, వెల్ఫేర్ అసిస్టెంట్లకు ఎన్‌పీసీఐపై అవగాహన కల్పించారు. బ్యాంక్ ఖాతాలకు ఎన్‌పీసీఐ అనుసంధానం చేసే విధానంలో బాగా వెనుకబడి ఉన్నామన్నారు. సచివాలయ స్థాయిలో వెల్ఫేర్ అసిస్టెంట్లు లబ్ధిదారుల పట్ల శ్రద్ధ వహించాలన్నారు. సంక్షేమ పథకాల పట్ల అలసత్వం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ నెల 19 నుంచి 22 వరకు, 26 నుంచి 29 వరకు ఆరేళ్ల లోపు పిల్లలకు ప్రత్యేక ఆధార్ శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు.

డీఎస్పీ ఔదార్యం



గాయపడ్డ మహిళను ఆస్పత్రికి తరలిస్తున్న డీఎస్పీ ప్రసాద్

ఉప్పలగుప్తం: మండలంలోని కిత్తనచెరువు సమీప ప్రాంతంలో తల్లీ కొడుకులు ద్విచక్రవాహనంపై ప్రయాణం చేస్తూ రోడ్డు అధ్వానంగా ఉండటంతో అదుపు తప్పి కిందపడ్డారు. ఈ క్రమంలో కుమారుడి వెనుకాల కూర్చున్న మహిళకు సోమవారం తీవ్ర గాయాలయ్యాయి. అటుగా వెళ్తున్న అమలాపురం డీఎస్పీ టీఎస్ఆర్‌కే ప్రసాద్ ప్రమాదాన్ని గుర్తించి క్షతగాత్రులను అమలాపురం ఏరియా ఆస్పత్రికి పంపి ఔదార్యాన్ని చాటుకున్నారు.

రోడ్ల అధ్వాన స్థితిపై కమిషనర్‌కు ఫిర్యాదు

అమలాపురం టౌన్: అమలాపురం భూపయ్య అగ్రహారంలో అధ్వాన స్థితిలో ఉన్న రోడ్లు, వాటివల్ల తనకు జరిగిన నష్టంపై పట్టణానికి చెందిన హైకోర్టు న్యాయవాది వి.రమేష్ చంద్ర వర్మ స్థానిక మున్సిపల్ కమిషనర్ కేవీఆర్ఆర్ రాజుకు సోమవారం ఆన్‌లైన్‌లో ఫిర్యాదు చేశారు. భూపయ్య అగ్రహారంలో రోడ్లపై గుంతల వల్ల తనకు జరిగిన నష్టాన్ని వివరిస్తూ న్యాయవాది వర్మ కమిషనర్‌కు పంపించిన ఫిర్యాదులో పేర్కొన్నారు. తనకు జరిగిన నష్టాన్ని ఫిర్యాదులో వివరిస్తూ రూ.50 లక్షల పరిహారాన్ని కోరారు.

అన్నదాన ట్రస్టుకు విరాళం

ఐ.పోలవరం: మురమళ్ల భద్రకాళీ సమేత వీరేశ్వర స్వామి ఆలయంలో అన్నదాన పథకానికి ఓ భక్తుడు విరాళం అందజేశారు. అనాతవరం గ్రామానికి చెందిన అత్యూరి శివరామ పవన్‌కుమార్ రూ.10వేలను ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణకు సోమవారం అందజేశారు. దాతను ఆలయ మర్యాదలతో సత్కరించారు.

బెల్ట్‌షాపు నిర్వాకుల అరెస్ట్

అమలాపురం టౌన్: అమలాపురం రూరల్, అంబాజీపేట మండలాల్లో అనధికార బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న నలుగురు నిందితులను సోమవారం అరెస్ట్ చేసినట్లు అమలాపురం ఎక్సైజ్ సీఐ సత్యనారాయణ తెలిపారు. అమలాపురం రూరల్ మండలంలో వివిధ ప్రాంతాల్లో బెల్ట్‌షాపులు నిర్వహిస్తున్న చిట్టూరి నాగరాజు, కొప్పిశెట్టి వెంకటేశ్వరావు, పప్పుల సుబ్బారావులను అరెస్ట్ చేశారు. వారి వద్ద నుంచి 42 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. కాకినాడ ఏసీ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆదేశాల మేరకు ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై ఎల్.విజయలక్ష్మి తన బృందంతో దాడులు నిర్వహించినట్లు చెప్పారు. అంబాజీపేట మండలం పుల్లేటికుర్రులో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న నేదునూరి గువ్వయ్యను ఎక్సైజ్ ఎస్సై పి.బాలాజీ అరెస్ట్ చేశారు.

సదాశివ.. సర్వేశ్వర..

- భక్తిశ్రద్ధలతో కార్తిక సోమవారం పూజలు
- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- అభిషేకాలు, అన్నసమారాధనలు



పాతకోరంగిలో రుద్రాక్షలతో దర్శనమిస్తున్న కురంగేశ్వరస్వామి



కుండలేశ్వరం పుష్కరఘాట్‌లో పూజలు చేస్తున్న మహిళలు

తాళ్లరేవు: పవిత్ర కార్తిక సోమవారాన్ని భక్తులు భక్తి శ్రద్ధలతో జరుపుకున్నారు. మండలంలోని శివాలయాలకు తెల్లవారు జామునుంచి పోటెత్తారు. పవిత్ర నదీ స్నానాలాచరించి ఆలయాల్లో విశేష పూజలు నిర్వహించారు. తాళ్లరేవులోని పురాతన శివాలయంలో అర్చకులు కొండవీటి శివరామకృష్ణ ఆధ్వర్యంలో భద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి వారికి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించారు. నీలపల్లిలో మీనాక్షీ సమేత శ్రీ నీలకంఠేశ్వరస్వామికి ఆలయ అర్చకులు శేషగిరిశర్మ విశేష అభిషేకాలు, అర్చనలు చేశారు. చొల్లంగి శ్రీ రాజరాజేశ్వరీ సహిత సోమేశ్వరస్వామి, పటవల, పిల్లంక గ్రామాల్లోని కాశీఅన్నపూర్ణేశ్వరీ సహిత విశ్వేశ్వరస్వామి, పాతకోరంగి బాలాత్రిపుర సుందరీ సమేత కురంగేశ్వరస్వామి, నీలపల్లి మీనాక్షీ సమేత నీలకంఠేశ్వర స్వామి, ఇంజరం ఉమా కృపేశ్వరస్వామి, ఉప్పంగల రామలింగేశ్వరస్వామి ఆలయాల్లో స్వామివారికి విశేష పూజలు చేపట్టారు. భక్తులు ఆలయ ప్రాంగణంలో పవిత్ర కార్తిక దీపాలను వెలిగించారు.

ఐ.పోలవరం: శివ నామస్మరణతో భక్తజనం పరవశులయ్యారు. కార్తికమాసం మూడో సోమవారం ప్రముఖ పుణ్యక్షేత్రం మురమళ్ల శ్రీభద్రకాళీ సమేత వీరేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారు జామునుంచి అధిక సంఖ్యలో భక్తులు బారులు తీరారు. స్థానిక గౌతమీ గోదావరిలో పవిత్ర స్నానాలు ఆచరించి కార్తిక దీపాలను గోదావరిలో వదిలారు. పలువురు భక్తులు గోపూజలు, రుద్రాభిషేకాలు చేశారు. భక్తులకు ప్రసాద వితరణ ఏర్పాటు చేశారు. ఆలయాన్ని విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ ఈఓ మాచిరాజు లక్ష్మీనారాయణ పర్యవేక్షించారు. కేశనకుర్రుపాలెం శివాలయంలో అభిషేకాలు, కుంకుమ పూజలు నిర్వహించారు. మండలంలోని కేశనకుర్రు, ఐ.పోలవరం, టి.కొత్తపల్లి, గుత్తినదీవి, ఎదుర్లంక గ్రామాల్లోని శివాలయాల్లో భక్తులు ప్రత్యేక పూజలు గావించారు.

కార్తికమాసం మూడో సోమవారం మండలంలోని శైవక్షేత్రాలు శివనామ స్మరణతో మార్మోగాయి. ముమ్మిడివరంలోని శ్రీ ఉమాసురేశ్వరస్వామి, క్రాప చింతలపూడిలోని శ్రీ వల్లభేశ్వరస్వామి, కొత్తలంకలోని భోగమల్లేశ్వరస్వామి ఆలయంతో పాటు అయినాపురం, తాన్నేల్లంక, అనాతవరం, కొమానపల్లి, అన్నంపల్లి గ్రామాల్లోని శివాలయాలకు భక్తులు పోటెత్తారు. పంచామృత అభిషేకాలు, లక్షపత్రి పూజ నిర్వహించారు.



మురమళ్ల వీరేశ్వరస్వామి ఆలయంలో అభిషేక పూజల్లో భక్తులు

అల్లవరం: కార్తికమాసం మూడో సోమవారం సందర్భంగా మండలం వ్యాప్తంగా శివాలయాలు కిటకిటలాడాయి. సోమవారం తెల్లవారుజాము నుంచి పెద్దఎత్తున భక్తులు స్వామివారి దర్శనానికి బారులు తీశారు. ఆలయాల వద్ద కార్తిక దీపాలు వెలిగించి పార్వతీ పరమేశ్వర్లను దర్శించుకున్నారు. ఎస్.రామేశ్వరంలో పార్వతీ సమేత రామలింగేశ్వర స్వామి, లక్ష్మణేశ్వరంలోని పార్వతీ సమేత లక్ష్మణేశ్వరస్వామి ఆలయాల్లో అభిషేకాలు నిర్వహించారు. దేవగుప్తంలోని ఉమా సమేత మల్లేశ్వరస్వామివారి ఆలయాన్ని దేవగుప్తం పరిసర గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి పరమేశ్వరుడిని భక్తిశ్రద్ధలతో కొలిచారు. బోడసకుర్రులో కొలువైన పార్వతీ సమేత గౌతమేశ్వర ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాట్రేనికోన: కార్తికమాసం మూడో సోమవారం పురస్కరించుకొని శివనామస్మరణతో శివాలయాలు మార్మోగాయి. పార్వతీ సమేత కుండలేశ్వరస్వామిని దర్శించుకునేందుకు భక్తులు వేకువ జామునే గౌతమీ గోదావరి నదిలో స్నానాలాచరించి స్వామిని దర్శించుకున్నారు. మహిళలు రావి చెట్టు చుట్టూ ప్రదర్శనలు చేసి దీపారాధన చేశారు. స్వామికి రకరకాల పుష్పాలు, బిల్వదళాలతో అలంకరించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. అన్నప్రసాద వితరణ ఏర్పాటు చేశారు.

యానాం: కార్తికమాసం మూడో సోమవారం పూజలు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక గౌతమీ గోదావరి నదీతీరంలో తెల్లవారుజాము నుంచే అధిక సంఖ్యలో మహిళలు పుణ్యస్నానాలు ఆచరించి కార్తిక దీపాలను గోదావరిలో వదిలారు. యానాం పరిసర ప్రాంతాలకు చెందిన భక్తులు స్థానిక పుష్కరఘాట్, శివమ్‌బాత్, కనకాలపేట పుష్కరఘాట్‌ల వద్ద పుణ్యస్నానాలు ఆచరించారు. స్థానిక శివాలయం వద్ద భక్తజనం పోటెత్తడంతో కిటకిటలాడింది.



యానాంలోని శివాలయం వద్ద భక్తజన సందోహం



నీలపల్లి నీలకంఠేశ్వరుడికి అభిషేకాలు చేస్తున్న అర్చకులు



మురమళ్ల వీరేశ్వరస్వామికి పంచామృత అభిషేకాలు నిర్వహిస్తున్న పండితులు



భక్తులకు దర్శనమిస్తున్న పార్వతీ సమేత లక్ష్మణేశ్వరస్వామి